సందెచీకట్లు ముసురుకుంటున్న సమయంలో రఘురామశెట్టి వచ్చాడు. ఆయన కోసమే ఎదురు చూస్తున్న మహతి .

"నే వెళుతున్నానండీ -- రేపుదయం వస్తాను ..... " గబుక్కున లేచిపోయి బయటకొచ్చేసింది.

మహతి అంత ముభావంగా వుండడం రఘురామశెట్టి ఎప్పుడూ చూడలేదు.

Take the time by the forelock and success is yours.

ఏమైంది మహతికి?

ఈ అవకాశాన్ని తను ఉపయోగించుకోవాలి.

రోడ్డుమీదకొచ్చిన మహతి ఆలోచిస్తూ నడుస్తోంది. చక చకా నడుస్తున్న మహతి చెయ్యి ఎవరో పట్టుకుని ఆపడంతో, తలతిప్పి చూసింది.

సుధారాణి .....

"ఏయ్ మహీ ..... అబ్బా ఎన్ని నెలలకే ..... ఇక్కడే వుంటున్నావా ..... " రోడ్డు మీద పెద్ద హడావుడి చేసింది సుధారాణి .

"మనవాళ్ళంతా ఎలా వున్నారు" అడిగింది మహతి .

"అందరూ బ్రహ్మాండంగా వున్నారు. కాస్ట్యూమ్స్ బిజినెస్ చేస్తున్నావటగదా ..... నిన్ననే తెల్సింది. డాడీ సంపాదించిన ఆస్తివుండగా నీకెందుకే బిజినెస్ ..... ప్రతిరోజూ నీ గురించి ఒక్క కుర్రాడయినా అడుగుతాడు తెల్సిందా."

"యూనివర్సిటీ ఇంకా నన్ను మర్చిపోలేదన్న మాట" నవ్వుతూ అంది మహతి.

"నిన్నా ..... మర్చిపోవడమా ..... సాలార్‌జంగ్ మ్యూజియంలో రెబెక్క సుందరినెవరయినా మర్చిపోతారా ..... " సాగదీయబోయింది సుధ.

“ఆపు తల్లీ ఆపు ..... నేనొస్తాను మళ్ళీ కలుద్దాం ..... ” ముందుకెళ్ళబోయింది మహతి.

“మహీ ఒక్క మాట ..... మధుకర్ మొన్న కలిసాడు. నిన్ను కలవాలని ఎంత ఆత్రంగా వున్నాడో తెల్సా ... ఎడ్రస్ అడిగాడు. నీ ఎడ్రస్ ఇప్పుడు తెల్సిందనుకో .....”

“ఏవంటాట్ట ..... ఈ సారి కలిస్తే నా ఎడ్రస్ చెప్పకు” ఎడ్రస్ చెప్పమంటుందేమో అనుకున్న సుధ ఆ మాటకు విస్తుపోయింది.

“ఏం ..... ”

“అదంతే ..... ”

“నేనయినా రావచ్చా?”

“ఆల్వేస్ వెల్‌కమ్ ..... కానీ ..... పూర్వంలా నీతో సిన్మాలకు, షికార్లకు రాలేను. అది గుర్తుంచుకుని రా.”

“ఇలా ఎన్నాళ్ళు.”

“ఏమో ..... సీ యూ బై ..... ” చప్పున ముందుకెళ్ళిపోయింది.

అంతవరకూ మాట్లాడుకుంటున్న వాళ్ళిద్దర్ని వాళ్ళకెదురుగా, రోడ్డుకు ఎడమవేపునున్న బస్టాపులో నించుని వున్న ఇద్దరు వ్యక్తులు గమనిస్తున్నారు.

వాళ్ళు కొన్ని నెలలుగా మహతిని, మధుకర్‌ను గమనిస్తున్న విషయం యెవరికి తెలీదు.

వాళ్ళని వినియోగించిన వ్యక్తి రాఘువేంద్ర నాయుడు వారానికొక రోజు వాళ్ళిద్దరి గురించిన రిపోర్ట్‌ను రాఘువేంద్ర నాయుడుకి వాళ్ళు ఇస్తూ వస్తున్నారు. వాళ్ళిద్దరూ రవికిరణ్ బావమరుదులు.

*          *          *          *

రూమ్‌లో -- రకరకాల మేగజైన్‌లు మధ్యనేసుకుని కూర్చుంది మహతి. స్టార్‌డస్టు, బ్యూటీ, సావీ, మూవీ, సితార, శివరంజని, చిత్రభూమి, ఎన్నెన్నో హిందీ, ఇంగ్లీషు సిన్మా మేగజైన్స్. ఇంకా ఎన్నో ఫ్యాషన్ మేగజైన్స్ ..... విమల్, రేమాండ్స్, బోంబేడైయింగ్, మఫత్‌లాల్, డి.సి.ఎమ్, బిన్నీ... కంపెనీల యాడ్స్‌ని నిశితంగా చూస్తోంది.

ఒక ప్రొడక్టు మార్కెట్లోకెళ్లాలంటే ఎడ్వర్టయిజ్‌మెంట్ అవసరం. పేపర్, రేడియో, టి.వీ, హోర్డింగ్స్ ..... ప్రకటనలకు మూలాధారాలివే .....

కానీ ఇంతకన్నా భిన్నంగా యాడ్‌కాంపైన్ చెయ్యలేమా? అన్నది మహతిని వేధిస్తున్న ప్రశ్న.

మేగజైన్లు ముందేసుకుని కూర్చున్న మహతి మెదడులోపల ఎన్నెన్నో రూపుదిద్దుకుంటున్న ఆలోచనలు .....

ఏ ఒక్కటీ నచ్చటంలేదు.

ఏదో సిన్మా మాగజైన్ తిరగేస్తూ, ఓ ఫోటో దగ్గర తన చూపుని నిలిపింది మహతి.

వైభవ్- ఫ్యాషన్ల వస్త్ర నందనాన్ని ప్రారంభిస్తున్న నేటి మేటి డ్రీమ్‌గర్ల్ శ్రీదేవి.

ఫ్యాషన్‌ల వైభవ్- ఫ్యాషన్‌ల రారాణి శ్రీదేవి, ఆ ఫోటోవేపు అయిదు నిమిషాల సేపు అలా చూస్తూ కూర్చుంది. ఫ్లాష్ ..... ఫ్లాష్ .....

క్రియేటివిటీ ఒక సముద్రంలాంటిది. అదెప్పుడు బుకుతుందో ఎవరికీ తెలీదు ..... ప్రస్తుతం-

తను భువనగిరిలో తయారుచేస్తున్న డ్రెస్ మెటీరియల్ మెన్స్ కోసం ఉద్దేశించింది - ఆ తర్వాత గర్ల్స్ అండ్ లేడీస్ ..... ఆ తర్వాత కిడ్డీస్ వేర్ ..... ఒక ప్రొడక్టుని తను మార్కెట్లో క్లిక్ చేయగలిగితే ..... మిగతా ప్రొడక్ట్సుకి ఆటోమెటిగ్గా క్రేజ్ ఏర్పడుతుంది ...

క్రేజ్ ఈజ్ ద పిల్లర్ ఫర్ మోడ్రన్ బిజినెస్ ..... మేగజైనులోని మరో పేజీ తిప్పింది. నాగార్జునతో ఇంటర్వ్యూ ..... రామ్‌గోపాల్‌వర్మ అంతం సిన్మా ప్రారంభోత్సవ విశేషాలు.

చక్ ..... చక్ ..... చక్ ..... మహతి మెదడులో ఏదో మెరుపు.

ఉత్సాహం ఉప్పొంగిన లేడిలా లేచింది. రూమ్‌కి తాళం వేసి, గబగబా రోడ్డుమీద కొచ్చింది. పరుగులాంటి నడకతో క్రాస్ రోడ్స్ కొచ్చింది. ఎడమవేపు పబ్లిక్ ఫోన్.

గబగబా అటువేపు నడిచింది. "నెంబర్ చెప్పండి.." ఆపరేటర్ అడిగాడు.

"నెంబర్ తెలీదు ..... మీరు కొంచెం కనుక్కోగలరా ..... " అలా అడుగుతున్న మహతి అందంవేపు ఓరకంట చూస్తూ - "ఎవరు నెంబర్ కావాలో చెప్పండి ..... "

"నాగార్జున్ సినిమా యాక్టర్ నాగార్జున్ ..... "

"నాగార్జునా ..... " నోరెళ్ళబెట్టాడు ఆపరేటర్.

"ఎస్.. ఎగ్జాట్లీ ..... "

డైరెక్టరీ తీసి, రెండు నిమిషాల సేపు తిరగేసి.

అన్నపూర్ణా స్టూడియోస్‌కి ఫోన్ చేసాడు.

ఇమ్మీడియట్‌గా రెస్పాన్స్ వచ్చింది.

"నాగార్జున గారా ..... "

"లేరండి. ఊటీ వెళ్ళారు. రేపు సాయంత్రానికి వస్తారు ..... "

ఆ మాటలు పక్కనే నిలబడ్డ మహతికి వినబడుతున్నాయి.

"ఊటీ వెళ్ళార్ట ..... "క్రెడిల్‌చేస్తూ అన్నాడు ఆపరేటర్.

ఒక్క క్షణం ఆలోచనలో పడింది మహతి . రూపాయి ఇచ్చేసి, వెనక్కొచ్చింది. పదడుగులువేసి, ఏదో జ్ఞాపకంవచ్చి మళ్ళీ వెనక్కొచ్చింది.

"ఊటీకి చెయ్యమంటారా ..... " నవ్వుతూ అడిగాడు ఆపరేటర్. తన ఉద్దేశాన్ని గమనించిన అపరేటర్ వీ క్యూని చిరునవ్వుతోనే మెచ్చుకుంది మహతి .

మళ్ళీ అన్నపూర్ణా స్టూడియోస్‌కి ఫోన్ చేశాడు. అక్కడి ఆపరేటరు ఏదో నెంబరు చెప్తే నోట్ చేసుకున్నాక, రిసీవర్ పెట్టేసి- "ఊటీలో ఫెర్న్‌హిల్ ప్యాలస్‌లో ఉన్నార్టండి ..... ఫోన్ నెంబరు 2055- ఊటీ ట్రై చెయ్యమంటారా ..... "

కళ్ళతోనే సంజ్ఞ చేసింది చెయ్యమన్నట్టుగా. అయిదు నిమిషాలు గడిచాయి.

"మేడమ్ ..... నాగార్జున ..... లైన్లో ఉన్నారు. " ఎక్సయిటైపోతూ అన్నాడు ఆపరేటర్.

"హలో ..... నాగార్జున గారా ..... హైద్రాబాద్ ఎప్పుడొస్తున్నారు మీరు ..... "

"రేపు సాయంత్రం ..... ఇంతకీ ఎవరు మీరు ..... "

"వచ్చాక మీరెక్కడుంటారు..."

"అంతం షూటింగ్ ..... అన్నపూర్ణాలో ..... ఇంతకీ ఎవరు మీరు"

"ఓ. కే... థ్యాంక్యూ సర్ ..... రేపు కలుస్తాను ..... " ఫోను పెట్టేసి-- "బిల్లెంతయింది"అడిగింది మహతి .

"ఎక్స్‌క్యూజ్‌మీ మేడమ్ ..... నాగార్జున మీ ఫ్రెండా" తడబడుతూ అడిగాడు ఆపరేటరు.

ఆ ఉత్సాహాన్నీ, ఉద్వేగాన్నీ గమనించింది మహతి - కాలేజీ రోజుల్లోని చిలిపిదనం గుర్తుకొచ్చింది. అబద్ధాలు, బ్లఫ్‌లు, మిమిక్రీలు, జోక్స్ ..... రాగింగ్ .....

"ఎస్ ..... జంటిల్ మెన్ ..... హి ఈజ్ మై బాయ్ ఫ్రెండ్ ..... " అని గట్టిగా అని రోడ్డుమీద కొచ్చేసింది మహతి . ఫోన్ కుర్రాడు కొయ్యబారిపోయాడు.

నాగార్జున గర్ల్‌ఫ్రెండ్ తన టెలిఫోన్ బూత్ నుంచి నాగార్జునతో మాట్లాడింది. ఆ విషయం ఆ తర్వాత వచ్చిన ప్రతి కష్టమర్‌తో చెప్తూనే వున్నాడు ఆ ఆపరేటర్.

అప్పటికి సమయం రాత్రి తొమ్మిదిన్నరయింది.

హోటల్లో భోంచేసి, రూమ్‌కెళ్ళి పోదామని పక్కనేవున్న అభిరుచి హోటల్లోకి అడుగువేసింది మహతి .

భోంచేస్తూ తన పక్క ఎవరో నిలబడ్డట్టు అనిపించి తలపైకెత్తి మహతి షాక్ తిన్నట్టయి పోయింది.

పక్కన నిలుచున్నది తండ్రి రాజేంద్ర ప్రసాద్ . హోటల్ మెట్ల మీద అడుగుపెడుతున్న మహతిని అదే దారంట కార్లో వెళ్ళిపోతున్న రాజేంద్ర ప్రసాద్ చూసి, కారుని ఆపి లోనకొచ్చాడాయన.

రాఘవేంద్ర నాయుడుకి ఆ సిటీలో ఎంత పేరుందో అంత పేరున్న వ్యక్తి రాజేంద్ర ప్రసాద్ -- ఇద్దరికీ ఉన్న తేడా ఐశ్వర్యం-- అదీకాక రాఘవేంద్ర నాయుడు షో మాన్. రాజేంద్ర ప్రసాద్ - స్లో మాన్.

బిజినెస్ సర్కిల్లో రాజేంద్ర ప్రసాద్‌కున్న పేరు అపారం.

అలాంటి హోటళ్ళకి ఎప్పుడూ ఆయన రాలేదు.

"డాడీ ..... " నెమ్మదిగా అంది మహతి . ఆ సమయంలో ఆమె కళ్ళలో సన్నగా నీళ్ళు కదిలాయి.

తండ్రి కళ్ళద్దాల మాటున కన్నీటి తడి ఆమెకు కనిపించలేదు.

తండ్రిని చూడగానే చెయ్యి కడిగేసుకోబోయింది మహతి.

ఆ చేతిని పట్టుకుని ఆపి, కళ్ళల్లోకి సూటిగా చూస్తూ--

"దేనికోసమైతే నీ కాళ్ళమీద నువ్వు నిలబడాలని బయటికొచ్చావో, దానిని వదిలిపెట్టడం మంచిది కాదు. నేను కూర్చుంటాను-- డిన్నర్ నెమ్మదిగా కానియ్ ..... "

తండ్రి ముఖం వైపు ఒకసారి చూసి చెయ్యి కడుక్కునే ప్రయత్నానికి స్వస్తి చెప్పేసింది.

పది నిమిషాలు గడిచాయి.

చెయ్యి కడుక్కుని వచ్చి కూర్చుంది మహతి .

"కూల్‌డ్రింక్ తీసుకుంటారా డాడీ ..... " నెమ్మదిగా అడిగింది మహతి .

"నీతో కలిసి భోంచేయమంటావేమోనని అనుకున్నానమ్మా ..... " తన తండ్రి అలాంటి కోరికను వ్యక్తం చేస్తాడని వూహించని మహతి కళ్ళు అశ్రుపూరితాలై పోయాయి.

మనసు ఆర్ధ్రతతో నిండిపోయింది. ఆ మనసు దు:ఖాన్ని దాచుకోలేని స్థితిలో ఉంది.

ఆ పరిస్థితిని గమనించాడు రాజేంద్ర ప్రసాద్ .

"కూల్‌డ్రింక్ తెప్పించమ్మా ..... " ఆ మాట అక్కడ దూరంగా నిల్చున్న మానేజర్ విన్నాడు. రెండు నిమిషాల్లో రకరకాల కూల్‌డ్రింకుల్ని ట్రేలో తనే స్వయంగా పట్టుకుని వచ్చాడు మానేజర్.

తండ్రికిష్టమైన కూల్ డ్రింక్ మజా, మహతి కూడా మజా బాటిల్‌ను తీసుకుని, తనే ఓపెన్ చేసి, ఆయన చేతికందించింది.

నెమ్మదిగా సిప్ చేస్తున్న తండ్రివేపు చూస్తోంది మహతి.

"బిల్లివ్వండి ..... " పక్కనే నిలబడ్డ మానేజర్ని అడిగింది.

"ఫర్వాలేదమ్మా ..... "

"మీరు ధర్మసత్రం మెంటైన్ చేస్తున్నారా ..... హోటల్ మెంటైన్ చేస్తున్నారా ..." అడిగింది మహతి .

రాజేంద్ర ప్రసాద్ పట్ల గౌరవాన్ని చాటుకుందామనుకున్న మేనేజర్ అయిష్టంగానే బిల్లు తెచ్చిచ్చాడు.

రాజేంద్ర ప్రసాద్ తన జేబులో చెయ్యి పెట్టబోయాడు.

"బిల్లు నేను పే చేస్తాను ..... "

యాభై రూపాయల నోటు తీసి అందించింది.

మరో అయిదు నిమిషాల తర్వాత--

ఇద్దరూ బయటకొచ్చారు.

కారెక్కి డ్రైవింగ్‌సీట్‌లో కూర్చున్నాడు రాజేంద్ర ప్రసాద్ .

"కారెక్కమ్మా ..... నువ్వెక్కడకెళ్ళాలో అక్కడ డ్రాప్‌చేస్తాను" కూతురి ముఖంలోకి చూస్తూ అన్నాడు రాజేంద్ర ప్రసాద్ .

"నో ..... థాంక్స్ ..... నడవడానికే రోడ్డుమీద కొచ్చాను డాడీ ..... లెట్ మీ వాక్ ..... "

ఇగ్నీషన్ కీ తిప్పాడు - కారు స్టార్టయింది.

"ఓ. కే... బేబీ ..... విష్‌యూ ఆల్ ది బెస్ట్ ..... "

"డాడీ ..... " ఆ మాట విన్పించుకోనట్టుగా పిల్చింది మహతి .

"ఏంటి బేబీ ..... "

"మమ్మీ ..... మమ్మీ ఎలా ఉంది ..... "

రోడ్డుమీద దీపాల అస్పష్టత వెలుతురు వాళ్ళిద్దరి మీదా పడుతోంది.

"నీకు తెలుసు ..... మమ్మీ  ఎలా ఉంటుందో."

"ఎస్ ..... ఎస్ డాడీ ..... ఐనో దట్ ..... " మనసులోనే అనుకుంది.

"మీ గడువు ఇంకా మూడు నెలలే ఉందనుకుంటాను.... అవునా " తలూపింది మహతి .

"ఈ మూడు నెలలూ ..... నిన్ను వదిలి నేనుండగలను ..... కానీ ..... మీ మమ్మీ ..... " అంతకంటే మాట్లాడదలచుకోలేదాయన.

కారు ముందు కెళ్ళిపోయింది.

* * * *

చాలా సేపటికిగానీ మనిషి కాలేకపోయింది మహతి .

"మీ గడువు ఇంకా మూడు నెలలే వుందనుకుంటాను ..... " తండ్రి మాటలే జ్ఞాపకం వస్తున్నాయి.

అంటే .....

తన గురించి నిరంతరం ఆలోచిస్తున్నారన్నమాట. ఆ ఆలోచనరాగానే మహతి మనసు లోపల్నించి దు:ఖం పొంగుకొచ్చింది.

తల్లీ, తండ్రినీ తలచుకొని ఎంతసేపు ఏడ్చిందో తెలీదు.

ఆశలువేరు, ఆశయాలు వేరు, ఒంటరిగా బ్రతకడం వేరు.

చాలా సేపయింతర్వాత, తనను తనే ఓదార్చుకుంది. ఎందుకేడ్చింది తను? ఇంకా తనలో పిరికితనం పోలేదా? బేలతనం పోలేదా? నవ్వొచ్చింది.

“మీ గడువు యింకా మూడునెలలే ఉందనుకుంటాను ..... ” తండ్రి మాటలే జ్ఞాపకం వస్తున్నాయి.

మూడు నెలలు. మూడు నెలలు ..... ఎవరు గెలుస్తారు ..... తనా ..... మధుకరా ..... తనే గెలుస్తుంది ..... తనే .....

గబగబా టేబిల్ డ్రాయర్ తీసి, అందులోంచి బ్యాంక్ ఎకౌంట్ బుక్ తీసింది.

అప్పుడప్పుడు వేసిన మొత్తం పదివేలవరకూ వుంది. కేలండర్‌లోని ‘డేట్’ వేపు చూసింది. ఆ నెలకు ఆ రోజు ఆఖరు రోజు. రేపు ఫస్టు.

రేపు ఉదయాన్నే తను మొట్టమొదట చెయ్యాల్సిన పని బ్యాంకు కెళ్ళడం ..... ఆ తర్వాత ..... నాగార్జునని కలవడం ..... నాగార్జున తన ప్రపోజల్‌కు ఒప్పుకుంటాడా? తనకు హెల్ప్ చేస్తాడా?

కనురెప్పలు మూతపడేవరకూ మహతి ఆలోచిస్తూనే వుంది.

*　　　*　　　*　　　*